# తప్పు పుట్టిన వాళ్లు

కాకతాళీయమో ఏమో నాకు తెలియదు...

ఆ రోజు దినపత్రికలోని రెండు విషయాలు నా కుటుంబానికీ, నాకూ సంబంధించినవి. దువ్వూరులో కల్తీ మద్యం తాగి పది మంది మరణించిన కేసులో మా అన్నలిద్దరినీ అరెస్టు చేసినట్లు ఒక వార్త వచ్చింది. తమకు ఆ ఘోరకలితో సంబంధం లేదని మా అన్న లిద్దరూ ప్రకటన చేసినప్పటికీ, ఏవో ఒత్తిళ్ల వల్ల అరెస్టయినట్లు వార్తలో ఉంది. ఈ వార్త నన్ను కిందు మీదు చేసింది. సమీక్షల పేజీ తిప్పానో లేదో నా సరికొత్త నవల 'నీలిలోయ' మీద సమీక్ష కన్పించింది. సంతోషం కొన్ని క్షణాలైనా నిలవలేదు. కనీస మర్యాదలూ, మానవ సహజ కారుణ్యమూ లేని విమర్శకుడో, విమర్శకురాలో 'మృణ్మయి' అట! ఎవరో? ఆడపేరుతో మగవాడే అయి ఉండవచ్చు. నన్ను ఏ దాక్షిణ్యమూ లేకుండా విమర్శించాడు. "పుణ్యం, పాపం అని సంఘ విలువల గురించి మాట్లాడుకునే అమాయకుల కుండే కనీస పాపభీతి కూడా లేని రచయిత...' అని నన్ను తిట్టిపోశాడు. 'నేరం, హింస, దౌర్జన్యం, సెక్సు, దొంగ సైన్స్‌ఫిక్షన్ లాంటి ప్రాణాంతక రసాయనాల్లో సాహిత్య కల్తీ సారాను వండిన అమానుష రచయిత...' అని నా మీద దుమ్మెత్తిపోశాడు. నాకు ఆ రకం విమర్శలు కొత్తకాదు. సరదాకోసం రచనలు మొదలు పెట్టిన వాణ్ణి. డబ్బు కోసం, కీర్తి కోసం, నా తృప్తి కోసం రచనలు చేస్తున్నవాణ్ణి. నా కెందుకీ విలువలూ గిలువలూ?

పత్రికలకూ, పాఠకులకూ లేని దుగ్ధ విమర్శకులకెందుకు? అదేమో! ఆ రోజు ఉదయం నాలో ఏం కదిలిందో ఏమో? మనసంతా కకావికలం అయింది. ఈ గొడవల నుంచి రెండు రోజులు ఎక్కడికైనా పారిపోవాలనిపించింది.

మా ఊరి నుంచి ఫోన్లు రావచ్చు. నగరంలోని నా రచయిత మిత్రుల నుంచి ఓదార్పులు వినవలసి రావచ్చు. వెటకారాలు ఎదురవ్వవచ్చు. నా అభిమానులు సంప్రదించవచ్చు.

ఎందుకు పీడ? రహస్య జీవితం మంచిది. ఖమ్మంలోని నా వీరాభిమాని సుబ్బారావు జ్ఞాపకం వచ్చాడు. అతని ఆహ్వానం ఎప్పటి నుంచో ఉండనే వుంది. కనీసం ఇరవై ఉత్తరాలు రాసి వుంటాడు. పది పర్యాయాలు హైదరాబాదు స్వయంగా వచ్చి ప్రాధేయపడి ఉంటాడు. ఖమ్మం నుంచి 'కిన్నెరసాని' కూడా పోవచ్చు. సుబ్బారావుకు ఫోను చేశాను. నా ప్రయాణం గురించి విని సుబ్బారావు పరమానందపడిపోయాడు. ఇంట్లో తానూ, ఇంటి మనిషిలాంటి మరొక పని మనిషీ తప్ప ఎవళ్లూ లేరన్నాడు. ఇంట్లోనే తప్పక దిగాలని మాట తీసుకున్నాడు. బస్టాండు దగ్గర ఎదురుచూస్తుంటానని చెప్పాడు. కారులో రమ్మనీ, ఆ ఖర్చు తానే భరిస్తాననీ పదే పదే అన్నాడు. ఇంకేం?

సొంత కారెందుకు లెమ్మని, టాక్సీలో బయలు దేరాను. చెప్పినట్లే ఖమ్మం బస్టాండు బయట సుబ్బారావు ఎదురు చూస్తున్నాడు. సుబ్బారావు కాక ఇతర అభిమానులు ఎవరూ లేరు. మనసు చివుక్కుమంది. అయినా ఈ రోజు కలవకపోవటమే మంచి దనుకున్నా.

ఏమో అనుకున్నాను. సుబ్బారావు వాళ్ల ఇల్లు చాలా అధునాతనంగా వుంది. సకల సౌకర్యాల్తో, మా ఇంటి లాగే. మేడ మీద గదిని నా కోసం సుబ్బారావు సిద్ధంగా వుంచాడు. ఆ బుల్లి స్వర్గంలో సోఫా మీద నేను వాలుతూనే సుబ్బారావన్నాడు:

"మాష్టారూ! మిమ్మల్నెవరూ ఇక్కడ డిస్టర్బ్ చెయ్యరు. ఇతర అభిమానులెవరికీ కావాలనే తెల్పలేదు; క్షమించండి. ఈ రెండురోజులూ మీరు నా 'స్వంతం'. కాదన కూడదు. మీతో చాలా విషయాలు చర్చించే అవకాశం కోసమే ఇన్నాళ్లూ ఎదురుచూశాను. దొరికింది. అన్నట్లు ఇక్కడ మీకు అన్నీ సిద్ధంగా ఉన్నాయి."

'అన్నీ' అనే మాట మీద నొక్కుడుకు నాకు నవ్వొచ్చింది. ఏమనను? ఎంతటి పుణ్యం చేసుకోక పోతే నాకు సుబ్బారవు లాంటి అభిమానులు ఏర్పడతారు. ఆ క్షణంలో నాకన్నా అదృష్టవంతుడైన రచయిత ఆంధ్రదేశంలో లేడని ఆనందం కల్గింది.

సుబ్బారావు అన్నాడు:

"మీరు రెస్ట్ తీసుకోండి. ఈలోగా కొత్తగూడెం వెళ్ళాల్సిన మా లారీల విషయం చూసుకొని వస్తా. మా నాన్న, అమ్మా విజయవాడ వెళ్లారు. వారం దాకా రారు. వ్యాపారం వ్యవహారం నేనే చూసుకోవాలి... మీ కెప్పుడు కావాలంటే అప్పుడు సూరమ్మ కాఫీ ఇస్తుంది. రేపుదయం సూరమ్మ వేసే దోసెలు తిని చూడాలి. పుట్నాలపొడి చల్లి, ఉల్లిగడ్డల కారం పూసి నెయ్యితో చేస్తుంది. కడప స్పెషల్..... అద్భుతం......"

సుబ్బారావు వెళ్లిపోయాడు. సుబ్బారావు లైబ్రరీ నుంచి ఏదో ఇంగ్లీషు నవల తీసుకున్నా పేజీలు కదల్లేదు. సూరమ్మ, దోసెలు అనే రెండు మాటలు నాస్మృతి మూలాలను ఎక్కడో తాకి కదిలించాయి. జ్ఞాపకాల మధ్య లంకె కుదరలేదు. ఒక మూల గోడకు చాలా అందంగా అమర్చిన సెల్లార్ తెరిచాను. మంచి ఫారిన్, ఇండియన్ డ్రింక్స్, వాటి వాటికి తగిన గ్లాసులు కన్పించాయి. సెల్లార్ తలుపులు మూసి వేశాను. ఫ్రిజ్ తెరిచాను. సోడాలున్నాయి. బీరుంది. ఫ్రిజ్ మూసివేశాను. నేను అవసరమైనప్పుడు తాగించటం తప్ప తాగటం మానేసి కొన్ని సంవత్స రాలైంది. తాగించవలసిన అవసరం ఉన్నవాడు తాగకూడదని నా నియమం.... అలసట వల్ల నిద్ర పట్టింది. లేచి మొహం కడుక్కొని కింద డైనింగ్ రూంలోకి వచ్చి కూర్చొని "సూరమ్మగారూ" అని పిలిచాను.

జీడిపప్పుల ప్లేటు, కాఫీ కప్పు తెచ్చి సూరమ్మ టేబుల్ మీద ఉంచింది. ఆశ్చర్యం! ఆమె మా ఊరి సారాయి సూరమ్మ. వరసకు నాకు పెద్దమ్మ. తప్పకుండా ఆమే! నలభై ఏళ్ల

కించటి దారుఢ్యం ఆమెలో లేదు. అప్పటి సౌందర్యం లేదు. ఆ బొట్టు లేదు. కానీ ఆమే.... ఆ పచ్చటి పసిమి. డెబ్బయేళ్లపైబడ్డా - ఆమే.... ఆమె నన్ను పోల్చుకోలేదు. వంటింట్లోకి వెళ్లిపోయింది. పలకరిద్దామనుకున్నాను. ఈలోగా సుబ్బారావు వచ్చాడు.

మేడమీదికి వెళ్లాక సందేహిస్తూనే సుబ్బారావు నడిగాను:

"సూరమ్మది ఏ ఊరు?"

"ఏదో కడప వైపు పల్లెటూరనుకుంటాను. సూరమ్మ కొడుకు విజయవాడలో మా బాబాయి లారీ కంపెనీలో డ్రైవరుగా ఉండేవాడు."

"అతని పేరు"

"మునిరెడ్డి. విజయువాడలో మా బాబాయిదగ్గరే ఉండి చదువుకున్నా. అప్పుడు మునిరెడ్డి నాకు పరిచయం. చాలా మంచి డ్రైవరు. మంచి మెకానిక్. నమ్మకస్తుడు. తాగి ఎప్పుడూ బండి ఎక్కేవాడుకాదు. కానీ బండి దిగితే తెగ తాగేవాడు. మా బాబాయి అప్పొనెట్ లారీ ఓనరు. డ్రైవర్లు ఏదో తగాదాల్లో అతన్ని చంపేశారు. మా ఇంట్లో తోడుగా ఉంటుందని మా బాబాయి రెండేళ్ళ క్రితం ఇక్కడికి పంపాడు. పాపం, చాలా మంచి మనిషి"

నా బాల్యస్మృతులు రెక్కలు విచ్చుకున్నాయి. అప్రయత్నంగా అన్నాను: "అవును.... సూరమ్మ.....మునిరెడ్డి నాకు తెలుసు"

సుబ్బారావు ఆశ్చర్యపోయాడు. నేనైతే గాలి సోకిన మనిషిలాగా సుబ్బారావు ముందు నా బాల్య స్మృతుల్ని పరిచాను:

"సూరమ్మది మా ఊరే. సూరమ్మ ఒక్కగానొక్క కొడుకు మునిరెడ్డి నా కంటే రెండు మూడేళ్ళు పెద్ద. నా కిప్పుడు తలచుకుంటే నవ్వొస్తుంది. ఏడెనిమిదేళ్ల వచ్చేదాకా మునిరెడ్డి వాళ్లమ్మ దగ్గర పాలు తాగేవాడు. సూరమ్మకు వాడంటే ఎంత ప్రేమో! మునిరెడ్డి వాళ్ల నాన్న కూడా మంచివాడే. చదువుకున్నవాడు. కానీ సాయమంటూ ఎవరొచ్చి అడిగినా చాలు పారు గూళ్లకు వెళ్లి తగాదాల్లో తలదూర్చేవాడు.

"నేనూ, మునిరెడ్డి కలిసి ఆడుకున్నాం, చెట్లెక్కాం, చెరువులో ఈదాం, కొండలెక్కాం, తోటల్లో తిరిగాం, అల్లర్లు చేశాం, చదువుకున్నాం. నిజం చెబితే నేనింత నవలాకారుడిగా ఎదగటానికి పునాదులు సూరమ్మ ఇంట్లోనే పడ్డాయేమో. వాళ్లింట్లోనే కొవ్వలి, జంపన నవలలు తీసుకొని చదివాను. మునిరెడ్డి చాలా తమాషా పనులు చేసేవాడు. ఒక మారు కామ సూత్రాల బొమ్మల పుస్తకమేదో పోస్టులో తెప్పించాడు. మా ఇంట్లో నేను ఒక నవల చదవటం చూసి మా చిన్నబ్బ అంటే మా నాన్న నాన్న తమ్ముడు చెవులు మెలేసి తిట్టాడు.

"అప్పట్లో ఏది తోస్తే అది చేసేవాళ్లం. సూరమ్మ సారా కాయించేది. అమ్మేది. మా ఊళ్లో ఒకరిద్దరు రైతులు మాత్రమే అప్పట్లో రహస్యంగా వెళ్లి తాగివచ్చేవాళ్లు. పక్క పల్లె కూలీ నాలీ జనం తాగే వాళ్లు. మా అబ్బ అంటే మా నాన్ననాన్న స్వాతంత్ర్యం కోసం జైలుకు వెళ్లిన మనిషి. ఆస్తికూడా పోగొట్టాడు. ఆయనకు ఎదురుగా ఎవరూ తాగి వచ్చేవాళ్లుకాదు. సూరమ్మకు కూడా ఆయనంటే భయం. బాంబుదాడిలో కాళ్లు పోగొట్టుకున్న భర్తనూ, పిల్లవాణ్ణి సాకటం కోసం ఈ పని చేస్తున్నానని సూరమ్మ చెప్పేది. భర్త ప్రోద్బల మనుకుంటాను. అయితే మా అబ్బ గాంధీ తత్వం మా పిల్లజట్టుకు కొంత వంట బట్టటం వల్ల సూరమ్మకు చికాకులు తెప్పించే వాళ్లం.

"సూరమ్మ మా ఊరి బయటి పొలాల్లో పూడ్చి మాగబెట్టిన బెల్లం, తెల్ల తుమ్మ చెక్క కలిపిన బానల్ని వెలికి తీసి పగల గొట్టేవాళ్లం. ఒకరోజు పగలగొట్టి ఇళ్లకు చేరుకున్నాం. ఆ రోజే

నాకు విపరీతమైన చెవి పోటు వచ్చింది. డాక్టరుకు చూపాలంటే పది మైళ్లు వెళ్లాలి. నాటు వైద్యుడికి చూపాలన్నా మూడు మైళ్లు పోవాలి. నా ఏడుపునూ, పెడబొబ్బల్నీ చూడలేక మా ముజ్జేజి అంటే మా నాన్న నాన్నమ్మ ఇంట్లో ఎవరికీ తెలియకుండా సూరమ్మ దగ్గరకు తీసుక వెళ్లింది. నేను లోలోపల హడలి చస్తున్నా. సూరమ్మ నవ్వుతూనే చెవిలో సారా చుక్కలు పోస్తూ అంది: 'పీడి ఒక్క చెవిలో అర దరాము సారాయి పడుతుంది. రెండు చెవుల్లో అర అర కలిపి ఒక దరాము... అంటే పావలా! నా వైపు తిరిగి అంది: 'చూడరా నా బానలు పగల గొడ్తావు గదా. నేను సారాయి అమ్మననుకో నీ చెవి నొప్పి ఏమయ్యేది?' నాకు నిజమే అన్పించింది. డబ్బు తీసుకోకుండా, ఆమె ముద్దు ముద్దుగా తిట్టిన తిట్లన్నీ హాయిగా అన్పించాయి. మరొక మారు ఇంట్లో నా అల్లరి బరించలేక మా అమ్మ అన్నం పెట్టలేదు. మా అమ్మంటే అందరికీ భయం. ఆకలవుతోంది. మునిరెడ్డిగారికి తెలిసింది. వాళ్లమ్మకు చెప్పాడు. సూరమ్మ మా ఇద్దరికీ కారాలు, కర్జికాయలు, అప్పచ్చులు పెట్టింది. అన్నం, కోడి కూర ప్రేమగా ఇద్దరికీ తినిపించింది.

"1952లో అనుకుంటాను. ఇంట్లో తయారు చేస్తున్న బాంబు పగిలి సూరమ్మ మొగుడు చనిపోయాడు. ఒకసారి సూరమ్మను పోలీసులు అరెస్టు చేశారు. మా అబ్బ విడిపించాడు. సారా వ్యాపారం ఇకనైనా మానుకోమన్నాడు. సూరమ్మ, మునిరెడ్డిని తీసుకొని ఊరు విడిచి వెళ్లిపోయింది. మా ఊరికి నేను వెళ్లినప్పుడల్లా చిన్ననాటి మిత్రులు వాళ్లిక్కడున్నారు, అక్కడున్నారు అని చెప్పేవాళ్లు. నేనెప్పుడూ చూల్లేదు. సూరమ్మను మళ్లీ ఇప్పుడే చూడటం."

ఏమైందో నాకు తెలియదు. నా కళ్ల తడి సుబ్బారావు గమనించాడు. ఆశ్చర్యపోతూ అన్నాడు:

"మీది ఎంత సున్నితమైన మనస్సు. అందువల్లనే మీరింత గొప్ప రచయిత కాగలిగారు."

సూరమ్మ కథను సుబ్బారావుకు చెప్పాక, నా మనసులో ఉదయం నుంచీ చోటు చేసుకున్నా టన్షన్ తగ్గింది. సూరమ్మను పలకరించి మాట్లాడుదామనుకున్నాను. సుబ్బారావుండగా మాట్లాడటం ఎందుకు లెమ్మనుకున్నాను.

ఆ రాత్రి భోజనం మేడ మీదకే వచ్చింది. పదకొండింటిదాకా సుబ్బారావు నవలల్ని మెచ్చుకుంటూ తనే ఎక్కువగా మాట్లాడాడు. అతని పరిశీలన విన్నాక, నా నవలల్లో అతను గమనించిన సాహిత్య మర్మాలన్నీ ఉన్నట్లే అన్పించింది. నా రచనా పద్ధతిలోని ఆయువు పట్లు అతను పట్టుకున్నాడు. కొంపదీసి తను నవలలు రాయడు కదా అనుకొని అడిగాను. అతను నవ్వి. "పూర్తయినప్పుడు మీరు చూస్తారు కదా. అది మీకే అంకితం" అన్నాడు. ఈర్ష్య లాంటిదేదో సుబ్బారావు మీద కలక్కపోలేదు. నిద్ర వస్తోందని పడుకున్నాను.

ఉదయం మగత నిద్రలో ఉండగానే సుబ్బారావు స్వయంగా కాఫీ కప్పుతో వచ్చి పలకరించాడు:

"మాష్టారూ! ముందుగా ఈ కాఫీ.... తర్వాత ఇతర కార్యక్రమాలు. అర్జంటుగా బయటికి వెళ్లి 10 గంటలలోపు అర్జంటుగా వస్తాను. టిఫిన్ సిద్ధమవుతోంది - సూరమ్మ స్పెషల్, నెయ్యిదోసెలు... నేను తిరిగి వస్తూనే మన 'కిన్నెరసాని' ప్రోగ్రాం ఫైనలేజ్ చేద్దాం"

మాటలెంత వేగంగా అన్నాడో, అంతే వేగంగా సుబ్బారావు బయటికి వెళ్లిపోయాడు. నేను స్నానం చేసి, బట్టలు మార్చుకొని డైనింగ్ హాల్లోకి వెళ్లాను. నిన్న అయితే 'సూరమ్మగారూ'

అని పిలిచాను - ఆవిడ ఎవరో తెలియక. ఈ వాళ్ల 'పెద్దమ్మా' అని చిన్నతనంలో పిలిచినట్లు పిలవాలనుకున్నా, పిలవ లేకపోయాను. కుర్చీ కదిలించాను. టేబులు మీదున్న గ్లాసుల్ని కదిలించాను.

సూరమ్మ ప్లేటును టేబులు మీద ఉంచింది. ప్లేట్లో దళసరి దోసెలు మూడు ఘుమఘుమలాడుతున్నాయి. సూరమ్మ నా ముఖం కన్పించేట్లు పక్కగా నిలిచి కాసేపు నిదానించి చూసింది. నాకు కుతూహలంగా ఉంది:

"ఎవరో అనుకున్నా నువ్వా? సుబ్బారావు చెప్పినాడులే పొద్దున్నే, నీ సంగతి, హైదరాబాదులో వుండావంట గదా? అంతా బాగుండారా?"

'అదే భాష, అదే అప్యాయత'. తల ఊపాను.

"ఎంత మంది పిల్లలు?"

"ఇద్దరు మగపిల్లలు. ఒక ఆడపిల్ల"

'ఏం సదువుకున్నారు; ఏం జేస్తాండారు?"

ఒకడు ఇంజనీరు, మరొకడు డాక్టరు, ఆడపిల్ల ఎం.బి.ఏ., అందరూ అమెరికాలో ఉన్నారని" చెప్పాను. మా అన్నల పిల్లల సంగతులు అడిగింది. అందరూ బాగున్నారని, ఇద్దరు అమెరికాలో ఉన్నారనీ చెప్పారు.

సూరమ్మ నిట్టురుస్తూ అంది:

"మీ ముజ్జేజి, మీ అబ్బ చేసిన పుణ్యం.... అయినా ఒరే అబ్బీ! మీ అన్న లెందుకు బ్రాందీ యాపారంలో దిగినారురా? ఆ మధ్యన మన పక్కలకు పోతే సెప్పినార్లే. పుణ్యాత్ముడి వంశంలో తప్ప పుట్టినారురా మీ అన్నలు. నువ్విట్లాంటి పాడు పని చెయ్యడం లేదుగదా. నేనా పాడుపని చేసే దుంపనాశనమయ్యాను."

ముసలామె పలుకులోని పదును చూసి జడుసుకున్నాను.

'నేరం, హింస, దౌర్జన్యం, సెక్సు, దొంగ సైన్స్ ఫిక్షన్ లాంటి ప్రాణాంతక రసాయనాల్తో సాహిత్య కల్తీ సారాను వండిన అమానుష రచయిత అన్న సమీక్షలోని మాటలు మనసులో మెదిలాయి. వణుకు పుట్టింది. మాట మార్పుటకోసం అడిగాను:

"మునిరెడ్డికి పిల్లలు లేరా?"

"ఒక్క ఆడపిల్ల, తల్లిని చంపి పుట్టింది", కంట తడిని చెంగుతో తుడుచుకుంటూ చెప్పింది. 'బాగా సదివిందనుకో, జగమొండి.' వెంటనే నవ్వుతూ అంది.

"ఇక్కడ లేదా?" అన్నాను.

"అయిద్రాబాదులోనే ఉంది. ఏదో రాస్తారంటనే దాంట్లో పని; నన్మురమ్మంటాంది. రావాల. నువ్వా తెల్సినోడివి ఉన్నావు. మా వంశంలో మిగిలింది ఆ పిల్లే. వీళ్లు బాగా సూసుకుంటున్నారనుకో."

"ఏదైనా పత్రికలో పని చేస్తోందా?"

"అదే అనుకుంటా"

"ఏం పేరు?" అసహనంతో, ఆరాటంతో అడిగాను.

"ఏందో నోరు తిరగని పేరు..... మున్మయి... అదేందో మురున్మయి. నేను మునెమ్మ అని పిలుస్తాను" సూరమ్మ తుళ్లి తుళ్లి నవ్వింది.

నాకు తెలియకుండా నా కాళ్లూ చేతులూ వణక సాగాయి. ఒళ్లంతా చెమటలు పట్టింది.

చంద్రశిలల నుంచీ చంద్ర మధువు తయారు చేసే చంద్రలోక ముఠాల మధ్య శత్రుత్వం గురించి 'మధు చంద్రశిల' అనే కొత్త నవలను రాస్తానని మొన్న ఒక వారపత్రిక నుంచి ఇరవై వేలు అడ్వాన్సు తీసుకున్నాను. ప్రకటన వెలువడింది - బహుమతుల పథకం మధ్య. కాగితం మీద కలం కదలటం లేదు. మృణ్మయి వ్యాఖ్యలు, సూరమ్మ అన్న మాటలు నన్ను చంపుకు తింటున్నాయి. ○

**●డిసెంబరు 1994, రచన సచిత్రమాసపత్రిక, జన్మదిన (దీపావళి) ప్రత్యేక సంచిక●**